౧

# మేలుకొలుపు

[నిజం అన్నది నెత్తిమీద సుత్తితో కొట్టినట్లుగా ప్రత్యక్షమవుతుంటుంది.
నిజాలలో కెల్లా పెద్దనిజం మరణం.
మరణం అంటే ఇది — అన్ననిజం నాకు ఎన్నో ఏట అవగతమయిందో జ్ఞాపకం లేదు. కాని ఒక పసివాడి మనసుకు మరణం — అన్నది ఎట్లా మొదటి సారిగా అర్థమవుతుందోనని ఊహించి రాసిన కథ ఇది.
ఈ కథలోని నాటకంసీనూ, నానాసాయిబు పాత్ర నా జీవితంలోంచి నడిచి వచ్చినవే.
రాయడానికి నేను కొంత ఇబ్బంది పడిన కథలలో ఇది ఒకటి]

"'తనకోపమె తన శత్రువు' ... అంటే కోపం అన్నది చాల చెడ్డగుణం. ఆ గుణం వుండడం మంచిదికాదు. అలాటి కోపంలేకుండా శాంతంగా - అంటే నెమ్మదిగా వుండడం చాల మంచిగుణం, అందుకనే_ 'తన శాంతమె తనకు రక్ష' ... సీనూ ... వింటున్నావా?"

ఉలిక్కి-పడ్డాడు... తల ఊపాడు. కాంతం టీచర్ సుమతి శతకంలోని పద్యం చెప్తూనేపోతూంది. అయినా మధ్య మధ్య సీను చూపు మళ్ళీ మళ్ళీ ఆ సాలెపురుగుమీదికే పోతూంది ...అది, ఆ సాలెపురుగు - పైకెక్కిపోతూంది... ఝుంయ్ మని విమానంలా దిగివచ్చింది... అదిగో వెనక్కి-పోతూంది. అది దేనిమీద నడిచివస్తూంది, ఎలా వెళ్తుంది అని, సీనుకు అర్థ మవలేదు.

“అందుకే — తన దుఃఖమె నరకమండ్రు, తథ్యము సుమతీ” అని ముగించింది కాంతమ్మ. సీను ఒక్క సారి తన ఎదుటి పుస్తకంలోని పద్యాన్ని చదువుకున్నాడు.

ఈ పుస్తకములో ప్రతి పద్యంచివరా, ‘సుమతీ సుమతీ’ అని వుంది... దాన్ని మకుటం అంటారుట... మకుటం అంటే కిరీటంట... మరి కిరీటమయితే రాజులు నెత్తిమీద పెట్టుకునేది కదా పద్యం చివర ఎందుకుండాలి అన్పించింది సీనుకి-టీచరమ్మ చెబుతున్న అర్థం తాత్పర్యం రాసుకోసాగాడు.

కిరీటం అనేసరికి బలేవిషయం గుర్తుకొస్తుంది సీనుకి.

ఓసారి-సెలవల్లో బావావాళ్ళూరికి వెళ్ళాడు. అక్కడ అక్కయ్యావాళ్ళింటో ఇంకో వాటాలో జోగారావూ, పొట్టి పంతులూ వుండేవాళ్ళు... ప్రక్కింటి అమ్మాయి రాజేశ్వరి వుండేది... ఓరోజు మధ్యాహ్నం ఏమయిందంటే, అక్కయ్య

క్రిందహాల్లో నిద్రపోతుంటే మేడమీదగదిలో తామంతా కలిసి మహారాజుల నాటకం ఆడారు. అప్పుడేమో తాను సముద్రగుప్త మహారాజువేషం వేశాడు. వాడుచాలా పెద్ద రాజుట. అని మూడోక్లాసు పుస్తకంచెప్పింది. రాజేశ్వరేమో రాణీ అన్నమాట. రాణీయేమో ఓ పెద్దతువ్వాలుని చీరగా చుట్టేసుకుంది. తనేమో గళ్ళ బెడ్ షీటుని మెడదగ్గర కట్టుకుని వీపుమీదుగా పొడుగ్గా జారవిడిచాడు. తను నడుస్తుంటే వెనకాతల ఆ బెడ్ షీటు నేలనిరాసుకుంటూ వచ్చేది. సినిమాల్లోలా వెనకాల ఆ బట్టను పొడుగ్గా పట్టుకోమని పొట్టిపంతుల్ని అడిగితే– "హాయ్! నేను... మంత్రిని! మంత్రులు అలా బట్టలు పట్టుకోకూడదమో–" అని 'ఉప్పాకప్పురం' పద్యం చదివాడు రాగాలతో. పోనీకదా అని జోగారావు నడిగితేనేమో– "నేనింకో ఊరిరాజుని... నీ బెడ్ షీటు నే పట్టుకుంటే నా వెనకాలవున్న ధోవతీని ఎవరుపట్టుకుంటారేవిటీ?"అన్నాడువాడు. అని కత్తిని విదిలించాడు కత్తంటే బావగొడుగన్నమాట. సరే జోగారావుకన్న తానింకా పెద్దరాజుగా వుండాలనిపించింది ...ఆలోచించి...ఆలోచించి ... వెళ్ళి బావపెట్టుకునే హేట్ ఒకటి తెచ్చాడు. అది పెట్టుకుని – సినిమాలో రాజులాగా నడుముమీద ఓ చెయ్యీ రాణీమీద ఓ చెయ్యీ వేసి– "ప రాజూ! నీ కప్పము ఎందుకు కట్టవూ?–అని అడిగాడుతను జోగారావుని– వాడుత్తి వెధవ, సినిమాలేవీ చూడడల్లేవుంది. సముద్రగుప్త మహారాజుకేమీ జవాబివ్వకుండా–"ఒరేయ్ సీనూ!...

అటోపీ రాజులు పెట్టుకోరా! కిరీటమంటే కుచ్చులూ ధగధగా మెరిసే రాళ్ళూ అవీ వుండాలి-" అన్నాడు. తనకేమీ తోచ లేదు కాస్సేపు. అప్పుడు రాణి చెప్పింది- "మహారాజా! మరే, నా మెళ్ళో దండ ఇస్తానూ... దాన్ని నీ కిరీటానికి చుట్టుకోరా!" అంది. అప్పుడే మంత్రికూడా "ఒరేయ్ రాజూ! ఆ కిరీటం ఇల్లా తే-" అని దాన్ని లాక్కుని దానికో రెండు నేపమాడలూ ఓ గన్నేరు పువ్వూ గుచ్చిఇచ్చాడు. మళ్ళా కిరీటం పెట్టుకుని. కాపింగు పెన్సిల్ని నాలికతో తడిచేసి మీసాలు గీసుకుని-మాంఛి ఇదిగా ఆ ఇంకోరాజుని కప్పంకట్టమని మళ్ళీఅడిగాడు. వాడేమో - "కప్పం కట్టనుపో! కత్తి యుద్ధానికిరా!!" అని అరిచాడు.

సరే. అమాంతంగా వాడు గొడుగునూ, తను బట్టల్ని దణ్ణెంమీదవేసే కర్రనీ పట్టుకొని, ఎగురుతూ, అరుస్తూ యుద్ధం చెయ్యసాగారు. బ్రహ్మాండంగావుంది కత్తియుద్ధం కాని-మధ్యని పొట్టిపంతులోకడూ- "ఒరేయ్ సీనూ, ఎప్పుడూ వాడితోనే యుద్ధం చేస్తావేం - కాస్సేపు నాతోకూడా చెయ్యరా -" అని అడిగాడు. ఓ నిముషం యుద్ధం ఆపి - "ఒరేయ్? రాజూ - మంత్రీ యుద్ధాలాడుకోరు-శత్రువులతోనే యుద్ధంచెయ్యాలి-" అన్నాడు తను. అని యుద్ధం మొదలెట్టాడు... "అయితే నాకీ మంత్రివేషం వద్దుపో!" అని కప్పు

కున్న చీరను పారేసి-వెళ్ళిపోయాడువాడు. పోతూపోతూ, నిద్రపోతున్న అక్కయ్యని లేపి వెళ్లాడు కాబోలు!

"ఏవిట్రా ఆగోలాం?" అంటూ అది గట్టిగా కేకలెడుతూ వచ్చేసరికి మహారాణి పరుగెత్తిపోయింది. తువ్వాలడ్డంవచ్చి క్రిందపడింది. తనేమో కిరీటాన్ని మంచంకింద దాచేశాడు. జోగారావు గొడుగుని అవతల పారేసి చేతులు గోక్కుంటూ నిల్చున్నాడు.

మూడ్రోజుల తర్వాత బావ, తన హేటంతా ఎవరో బొక్కలు పొడిచేశారని - అక్కయ్యతో అంటున్నాడు. కిరీటాన్ని ఎవరన్నా హేటంటారా లేవిటీ!!

-సీనుకి అదంతా గుర్తుకొచ్చి కాంతం టీచర్ చెబుతున్నది సరిగా వినపడ్డంలేదు. ప్రక్కనున్న రామ్మూర్తి మోచేత్తో పొడిచాడు. టీచర్ ఇటేవస్తోంది... గబగబ రాస్తున్నాడు సీను. ఈలోపుగా ఎదుటి బెంచీమీంచి నానాసాయిబు నోటుపుస్తకం అడ్డంగా పెట్టుకుని ఒక సీతాకోక చిలుకని చూపించాడు!

నానాసాయిబు పొడుగ్గా పెద్దగా వుంటాడు. వాడికి నిజం మీసాలుంటాయి. టీచర్లెప్పుడూ వాడిని బెంచి ఎక్కించరు. ఎక్కిస్తే వాడితల పైనపెంకులకి తగుల్తుంది, అనుకుని ...ఇంచక్కనిసీతాకోక చిలుకల్ని వాటినీ పట్టేస్తాడు వాడు.

మొన్ననోసారి తనకోదాన్ని ఇచ్చాడు. దాన్ని డ్రాయింగు బుక్కు-మధ్య పెట్టుకున్నాడు తను. దాని రెక్కలు మెత్తగా అమ్మపట్టుచీరలా వున్నాయి ... అందంగా వున్నాయి. ఈ సారి అక్కయ్య వూరికెళితే రాజేశ్వరికి చూపించాలి. అదేమో— ఓ నెమలి ఈకను పుస్తకంలో పెట్టుకుని – అది పిల్లలు పెడు తుందని చెప్పింది. తనకు నవ్వొచ్చింది.

ఒక్కసారిగా గొల్లుమని చప్పుడయితే పీరియడ్ అయి పోయిందని తెలిసింది సీనుకి. తెలుగు పీరియడ్ తర్వాత భూగోళంక్లాసు. భూగోళం చెప్పడానికి మేరీనవమణి టీచర్ వస్తుంది. ఆమెగొంతు మగవాళ్ళలా వుంటుంది. ఆమె మాట్లా డితే అమ్మమాట్లాడినట్లు, రాజేశ్వరి మాట్లాడినట్లు వుండదు సీనుకి. అల్లాగే – ఎదురింట్లో నల్లసీత నాన్న – ఆచార్లుగా రున్నారే – ఏవో మామూలూ అవీ ఇస్తుంటాడే – ఆయనజుత్తు పొడుగ్గా వుంటుంది, పెద్దగా ముడివేసుకుంటాడు – ఆడవాళ్ళ లాగున... – ఆడవాళ్ళగొంతు మగాళ్ళలా ఎందుకుంటుంది? మగాళ్ళుకూడా జడలు వేసుకుంటారేవిటి-అన్నవి సీనుకి రెండు సమస్యలయి పోయాయి. నవమణి టీచర్ చిన్నిగ్లోబుని చూపిస్తూ పాఠం చెప్పేస్తూంది.

నానాసాయిబు లేచి అడిగాడు. "మరి టీచర్ గారూ! భూమికూడా ఇలాగే గుండ్రంగా వుందికదా, కొన్నికొన్ని సముద్రాలకి కిందుగా ఖండాలున్నాయికదా, ఆ ఖండాల మీదికి నీళ్ళువచ్చేయవాండి-?"

ఎవళ్ళో నవ్వారు. సీనుకికూడా నానాసాయిబు వేసిన ప్రశ్న సరయినదే అనిపించింది. కాని నవమణి టీచర్ నానాసాయిబుని కూర్చోమంది. ఖండాల్నిగురించి చెప్పసాగింది. నానాసాయిబు కోపంగా చూశాడు. టీచరమ్మని కొట్టేస్తాడేమోనని భయంవేసింది సీనుకి, మరి నానా పొడుగ్గావుంటాడు కదా-

పరీక్షల్లో ఎప్పుడూ నానాసాయిబు సీనుకాగితాలని చూసి కాపీ కొట్టేస్తుంటాడు. అందుకు బదులుగా సీనుకి సీమ చింతకాయలు, నేరేడుపళ్ళు, అవీ తెచ్చిఇస్తుంటాడు. నేరేడు పళ్ళుతింటే నాలుక నీలంగా తమాషాగా అయిపోతుంది... ఓసారి లెక్కలపరీక్ష జరుగుతుంటే నానాసాయిబు సీను లెక్కలువేసిన కాగితాలన్నీ లాగేసుకున్నాడు టీచర్ చూడకుండా. వినీవినపడకుండా సీను బెదిరించాడు నానాని_ "ఇలా చేస్తే టీచరుతో చెప్పేస్తా-" అని. వెంటనే నానాసాయిబు ఆ కాగితాల్ని ఇచ్చేశాడు. కాని సాయంకాలం ఇంటికివెళ్తుంటే దారిలో ఒకపెద్ద చింతచెట్టుంది-దానికొమ్మమీదికి బలవంతాన ఎత్తికూచోపెట్టేశాడు. సీను ఎంతమొత్తుకున్నా దింపలేదు. అక్కడనుండి దిగడానికి వీల్లేదన్నాడు నానా. అన్ని పరీక్షలలోనూ ఆన్సర్ కాగితాల్ని కాపీచెయ్యడానికి ఇస్తేనే దింపుతానన్నాడు. ఆఖరుకు సరే అన్నతర్వాత సీనునిదింపాడు. మంగమ్మగారి తోటలోంచి రెండు మాంచి చెరుగ్గడలు తీసి

చ్చాడు. ఆ చెగుగ్గడలు రెండూ నానాసాయిబే ఇచ్చాడే అని ఎంతచెప్పినా అమ్మ నమ్మలేదు కద. తనే ఎవరితోటనుండో తీసుకొచ్చేశానని కాబోలు ... బలేవాడు నానాసాయిబు ...

ఇంకోసారి – నానాసాయిబే సీనునిపిలిచి ఒక కాగితం ఇచ్చాడు. "ఇదిగో ... నాగవేణి వెళ్తున్నదే, దానికిచ్చిరా ... ఎవరూ చూడకుండా ఇచ్చిరావాలి ..." అన్నాడు. నాగవేణి అంటే ఎనిమిదోక్లాసు. తనుకన్న మూడుక్లాసులు పెద్ద. పెద్ద క్లాసుల వాళ్ళంటే సీనుకి చెడ్డగౌరవమూ, భయమూను, అదీ కాక మనిషిఎదుట కనబడుతుంటే హాయిగా వెళ్ళి మాట్లాడే యక ఈ కాగితాలెందుకూ అని అర్థంకాలేదు సీనుకి ... ఈ ఆలోచనలో వుండగానే నాగవేణి వెళ్ళిపోయింది. నానా సాయిబు తనకాగితం తీసేస్కున్నాడు.

ఖండాల విషయం అయిపోయింతర్వాత భూమధ్య రేఖనిగురించి చెబుతూంది నవమణి టీచర్. ఆమె పెదవులు గులాబీల్లావుంటాయి. ఎన్నితమలపాకులు వేసుకున్నా అమ్మ నోరు అలారాదేం అనుకున్నాడు సీను, తమలపాకులంటే తనకు ఇష్టమే. కాని అవివేసుకుంటే చదువురాదట, అని నాన్నగారు చెప్పారు. కాని అప్పుడప్పుడూ అమ్మదగ్గర్నుంచి లాక్కుని నమిలేస్తుంటాడు. "వెధవాయి–నాలుక ఎర్రగాపండింది ... బలే అదృష్టంవీడికి–" అంటుందిఅమ్మ. అలా ఎందుకంటుందో!

అల్లాగే-అమ్మ తనకు ఒళ్ళంతానూనెరాచి. ఇంచక్కా తలంటిపోసి - 'శ్రీరామరక్ష - నూర్యేళ్లాయుష్షు' అని ఆఖరి చెంబు నీళ్లుపోసేసి, తువ్వాలుతో తుడుస్తుంది ... తనతల దువ్వుతుంది ... ఏం, దువ్వుతుందా-పాపిడి తీస్తూ తీస్తూ- "పాపిడి చాల పొడుగండోయ్ మనవాడికి! వీడి అత్తారిల్లు చాలా దూరంగా వుంటుందన్నమాట." అంటుంది అమ్మ ... అసలు అత్తగారంటే ఎవరూ? ఎవరయితేమాత్రం తను అమ్మను విడిచి ఎక్కడకయినా పోతాడేవిటి - ఊహూ:

గంటకొట్టారు.

ఆ పూటకు బడి అయిపోయింది. మైదానంలోకి వెళ్లాడు సీను. మధు, శాస్త్రి వాళ్ళతో కలిసి చెడుగుడు ఆడాడు. ఎదుటి జట్టులో చింతయ్య శెట్టి తప్పుగాఆడి, సీను అవుటయ్యాడన్నాడు. సీనుక్కోపం వచ్చింది.

"నేను అవుట్ కాలేదు-" అన్నాడు.

"మొండివి ... నువ్వు అవుటయ్యావు ... ఆటనుండి పో-" అన్నాడు చింతయ్య.

తిన్నగా వెళ్ళి చింతయ్య ముక్కుమీద ఒక్కదెబ్బ వేశాడు సీను. ఈ లోపుగా శాస్త్రివాళ్ళంతావచ్చి విడదీసారు ... కాని ముక్కువెంబడి కొద్దిగా నెత్తురువచ్చింది చింతయ్యకి.

సీనుకి ఏవిటోగా అయిపోయింది. ముక్కు దగ్గర రుమాలు అడ్డం పెట్టుకుని చింతయ్య వెళ్ళిపోతుంటే– "ఒరేయ్–ఇంకెప్పుడూ ఇలా చెయ్యకు నా...నన్ను ముక్కు మీద కొట్టరా..." అని అడుగుదా మనిపించింది...కాని...

నెమ్మదిగా అయిదున్నరకు ఇల్లుచేరాడు సీను. పుస్తకాలసంచి అవతలపారేసి అమ్మదగ్గరకు పరుగెట్టు కెళ్ళాడు. అమ్మ మంచంమీద పడుకునివుంది. "అమ్మా కాఫీయే!" అని అడిగాడు.

"కాఫీ – బామ్మ ఇస్తుంది నాయనా, వెళ్ళి తాగిరా–" అని వాడితల నిమిరింది. అమ్మగొంతు మారినట్లుంది – అనుకున్నాడు సీను,

ఈలోపుగా బామ్మే వచ్చింది. సీనును తీసుకెళ్ళింది. "అమ్మకి జొరమమ్మా! ఏదికావాలన్నా నన్నడుగు నేనిస్తా–" అంది బామ్మ.

"మరి అమ్మ జొరం ఎప్పుడు పోతుందీ?"

"ఇంకో వారంలో పోతుందిలే–ఇదిగో కాఫీ–" అని ఇచ్చింది బామ్మ. కాఫీ తాగాడు సీను...

–ఓసారి నాన్నకూడా ఇలాగే జొరంవచ్చింది. అప్పుడాయన ఎలా వణికి పోయేవారనీ!– మూడో నాలుగో కంబళీలు కప్పుకునేవారు ... అయినా ఇంకా వణుకుతూ వుండే

వారు- ... "సీనూ-నామీదపడుకోరా-" అనేవారు. తాను పడుకునేవాడు అబ్బ ... ఆ కంబళీలు బలే గుచ్చుకునేవి. అవన్నీ తీసేసి నాన్న వీపుమీద పడుకుంటానంటే అమ్మ నవ్వేది. ఎందుకోమరి-అమ్మ ఇలానవ్వేస్తే నాన్న అలా అమ్మమొహం చూసేస్తాడు. అమ్మ మంచిది. అమ్మంతా అచ్చం తనదే. అమ్మలాటి అమ్మ ఇంకెవరికీలేదు. అమ్మ తన్నెప్పుడూ కొట్టదు. కానీ ... ఓ సారి బలేభాదింది.

అప్పుడేమో ప్రక్కింటబ్బాయి కృష్ణారావు చెప్పాడు- "ఒరేయ్ సీనూ! మీ వంటింటి అలమార్లో ఓవల్టిన్ డబ్బాలో మూడ్రూపాయిలున్నాయి అవి తెచ్చేవంటే మనం ఇ ... న్ని ... గాలిపటాల్ని కొనుక్కుందాం"! అన్నాడు. మొదట తను ఒప్పుకోలేదు. ఆఖరికి కృష్ణారావ్ ఇంక తనజట్టుండ నన్నాడు.

కృష్ణారావంటే - నానాసాయిబంత పొడుగ్గా వుండడు గాని మద్రాసూ హైదరాబాదూ అవన్నీ చూసివచ్చాడు. మద్రాసులో రేలంగీ అంజలీదేవీ అంతా రోజూ కూరలు కొనుక్కోవడానికి మార్కెటుకు వస్తార్ట? హైదరాబాదులో నేమో మేడబస్సు లుంటాయట - వాటిమీద ఇంచక్కా పండుకునే వెళ్ళొచ్చుట! ఇంకా మరేమో కృష్ణారావు దగ్గర కేరంబోర్డూ అవీ వున్నాయి. వాడు జట్టుండకపోతే ఎలా?

నెమ్మదిగా ఆ మధ్యాహ్నం అమ్మ నిద్రపోతున్నప్పుడు వంటింట్లోకి వెళ్ళాడు. కృష్ణారావుకూడా వచ్చాడు. వంటింటి

అలమార అందకపోతే - నాలుగుపీటలువేశాడు కృష్ణారావు. ఓవల్టిన్ డబ్బాలో చాలాడబ్బుంది. అయినా తనుమాత్రం మూడురూపాయలే తీశాడు. అబ్బ... అప్పుడు ఎంతభయం వేసిందో-! అమ్మ నిద్రపోతూనేవుంది. నెమ్మదిగా వీధిలోకి వచ్చారు. బజారుకు వెళ్లారు. పదో పన్నెండో గాలిపటాల్ని కొన్నారు. పెద్ద దారపుండలు రెండు కొన్నారు. ఓ రూపాయకు గోళీకాయలుకొంటే, ఓ అట్టపెట్టెనిండా ఇచ్చాడు అంగడివాడు. సిగరెట్టుల్లా పొడుగ్గావుండే పిప్పరమెంట్లు చెరో పావలాకి కొన్నారు. అన్నీ పట్టుకుని తిరిగివస్తుంటే బామ్మ ఎదురయింది. బరబర ఇంటికి లాక్కెళ్ళింది. అంతే... అమ్మ టపటపాకొట్టేసింది. అమ్మ ఎప్పుడూకొట్టదు. అవాళేకొట్టింది. అందుక్కారణం కృష్ణారావే. అందుకని వాడి సావాసం వదిలేశాడు తను...

—నాన్నారు మాత్రం మంచివారు కారూ? ఎందుక్కారూ, చాలా మంచివారు. ఎప్పుడయినా కాళ్లుతొక్కితే అణా ఇచ్చేవారు ... అమ్మెప్పుడయినా తిడితే తనువెళ్ళి నాన్నతో చెప్పేసేవాడు. ఆ ఫలంగా నాన్నకు అమ్మమీద బలేకోపం వచ్చేసేది. అంతే! ఇంక అమ్మని తాళ్ళతోకట్టేసి కర్రతో కొట్టేస్తానసేవారు నాన్న. తాళ్లూ బెత్తమూ తెచ్చిపెట్టమని తన్నే అడిగేవారు... అమ్మయ్యో అమ్మని కొట్టడవే!... "వద్దు నాన్నా... అమ్మని కొట్టొద్దు నాన్నా..."

అని తాను బతిమిలాడితే అప్పుడూరుకునేవారు నాన్న... తానుగనక అలా చెప్పకపోతే అమ్మ ఏమయిపోనూ!?

కాఫీ తాగేసిన సీను వీధిగుమ్మంలోకి వచ్చాడు. అరుగు మీద కూర్చున్నాడు. ఇంతలో టైగర్ తోకాడించుకుంటూ వచ్చింది. దానితోక చూచినప్పుడెల్లా- 'కుక్కతోక వంకర' అన్నది గుర్తుకొస్తుంటుంది. అది కాంతంటీచర్ చెప్పినవాక్యం. అబ్బబ్బ ఇలా మీదపడి నాకేస్తుందేం ఈ టైగర్... దాని మూతిదగ్గర మెత్తగా, తడిగా, నల్లగా, తమాషాగావుంటుంది. రాజేశ్వరికి పిల్లులంటే ఇష్టం. కాని తనకో - టైగరంటేనేఇష్టం. రోజూ భోజనాలవగానే అమ్మ టైగర్‌కి అన్నం పెడుతుంది. అప్పుడు అది ఎలాగెంతుకుంటూ మూలుగుతూ వెళ్ళి తింటుం దనీ...! ఒక్కోసారి తను బడికివెళ్తుంటే బజారువీధిదాక వెన కాలేవస్తుంది. ఎంత తరిమినా పోదు——

"ఛీఛీ - లాగూని కొరుకుతున్నావేమిటివాళ?" అని కసురుకున్నాడు సీను. టైగర్ మాట్లాడకుండా తలవంచుకుని దూరంగానిల్చుంది. సీనుకి జాలేసింది.

"ఆకలిగా వుందామ్మా? అల్లాగేవుండు వస్తా-" అని దాన్ని ఒకసారి చేతుల్లోకి ఎత్తుకుని ముద్దాడి కిందకుదించాడు. మళ్ళీ తోకఆడించడం, అరవడం సాగించింది టైగర్.

"ఊ! అల్లరి చెయ్యకు ... బామ్మవింటే తంతుంది." అని దాన్ని గుమ్మందగ్గరే విడిచి-లోపలికివెళ్ళాడు సీను.

"బామ్మా! ఆకలిగావుందే..."

"అదేమిట్రా, ఇందాకేగా పూరీలు తినికాఫీ తాగావూ!"

"ఇంకో పూరీ కావాలే-!"

బామ్మ ఇచ్చింది. వీధిలోకి వచ్చాడు. టైగర్‌కి ఎంత సంతోషం! ఫుట్‌బాల్‌లా ఎగిరెగిరిపడుతూ లేస్తూ చేతిలోంచి లాక్కోబోయింది. పూరీని చేత్తో ఎత్తుగా పట్టుకుని సర్కసులో లాగా టైగర్‌ని ఒకటి రెండుసార్లు ఆడించాడు; ఆఖరికి దానికాపూరీ నిచ్చాడు సీను.

కాసేపుండి టైగర్ వెళ్ళిపోతే-సీను దొడ్లోకివెళ్ళాడు. అక్కడ ఎన్నో చెట్లున్నాయి. వాటిల్లోపొడుగ్గా నానాసాయిబు కన్న ఎత్తుగా ఒకచెట్టుంది... దానికి పొడుగాటి పూవులు-తెల్లవి-వుంటాయి. అవి రాలుతుంటే చూడ్డానికి ఎంతో బావుంటాయి. రాలిన పువ్వులన్నిటినీ ఏరి గుత్తులు గుత్తులుగా కడతాడు తను. ఒక్కోరోజయితే అల్లా ఎన్నిగుత్తులు తయారయ్యేవనీ... తల్లో పెట్టుకోమ్మని అమ్మచేతికవన్నీ ఇస్తే "పిచ్చినాయనే!" అని నవ్వింది... అవతల కుండీలలో గులాబీ మొక్కలున్నాయి. గులాబీపువ్వంటే ఇష్టమేకాని కొయ్యడం జాగ్రత్తగాకొయ్యాలి. లేకపోతే ముళ్ళు గుచ్చుకుంటాయి... దాని రేకులు మెత్తగా ఉంటాయికదూ-బళ్ళో కొందరుతింటారు

వాటిని. కాని అలాచెయ్యడం తనకు బావుండదు... వెళ్ళి ఆకాశమల్లె చెట్టుకింద నిల్చున్నాడు సీను. తనమీద రాలిపడ్డ పువ్వుల్ని లెక్కపెట్టసాగాడు.

ఇరవైమూడు పువ్వులు రాలాయి.

—నాన్నా రొచ్చినట్లున్నారు. ఇంటోంచి విన్పించింది సీను లోపలికి పరుగెత్తాడు. నాన్నగారితో బాటు ఒకాయన వచ్చాడు. తోలుసంచీ ఇంకేదో రబ్బరు గొట్టమూ పట్టుకుని వున్నాడు-వాళ్ళిద్దరూ అమ్మగదిలోకి వెళ్ళారు. తను హాల్లోంచే చూశాడువాళ్ళని. అమ్మదగ్గరికి వెళ్ళాలనివుంది. కాని...

ఆ క్రొత్తాయన....డాక్టర్ కాబోలు.

* * *

రెండువారాలు గడిచాయి. ఒక బుధవారం సాయంకాలం బడినుండి వచ్చాడు సీను.

బామ్మ హడావిడిగా కాఫీఇచ్చింది. తాగేసి వీధిలోకి వచ్చాడు. ఎదురింటి ఆచార్లిగారి నల్లసీత కనపడింది. ఆచార్లింటో ఇద్దరికి ఒకేపేరుండంమూలాన్ని, కాస్త రంగు తక్కువయిన అమ్మాయిని నల్లసీత అని పిలిచేవారు. పొంకంగా అరుగుమీద కూర్చుని గౌనులో పోసుకున్న బఠాణీలు తింటూంది నల్లసీత. సీను వీధిదాటాడు. దానిదగ్గరికి వెళ్ళి అడిగాడు- "ఏమే-నాక్కొన్ని పెట్టవూ?"

అదేమీ మాట్లాడ్లేదు. జాగ్రత్తగా ఒక బఠాణీపొట్టుని తియ్యసాగింది.

"ఒసేయ్....మొన్న టైగర్ నిన్ను తరుముతుంటే నేను దాన్ని ఆపలేదుటే....? సరేలేవే. బఠాణీ లివ్వకపోతే పోన్లేవే" అని నిష్ఠూరాలు మొదలెట్టాడు సీను.

నల్లసీత నవ్వింది తెల్లగా...."ఇందరా సీనూ ఇది నీకే తీసుకో-" అని పొట్టుఒలిచిన బఠాణీలు రెండిచ్చింది.

"మరే....టైగర్ చాలమంచిది....దాన్నిచూసి నువ్వు భయపడక్కర్లేదు-" అన్నాడు బఠాణీల మధ్య సీను.

"ఊహూ....నాకు భయ్యం...." అందిసీత.

నవ్వాడు సీను. సీత ఉత్తి పిరికిది. లేపోతే టైగర్ని చూసి భయపడ్డమేమిటి?... అన్నట్టు టైగర్ కనబడి నాలు గయిదు రోజులయింది. అన్నానికూడా రావడంలేదు. ఇంతకుముందూ ఓసారి ఇలాగే అయింది. ఓ వారం కనబల్లేదు టైగర్. అలా ఎక్కడికో వెళ్ళిపోయి - హఠాత్తుగా ఒకరోజు మధ్యాహ్నం వచ్చేసి తమఇంటిముందు నిల్చుని అరవ సాగింది.. అలా ఎక్కడికి వెళ్ళిపోతుందీ-అని.... తమసెలవల్లో అక్కయ్యవాళ్ళు వూరెళ్లొచ్చినట్లు టైగరూ ఎక్కడికయినా

వెళ్ళొస్తుందేమో... ఆ! అయినా టైగర్‌ని రైల్లో ఎక్కనిస్తా రేమిటీ? ...

—ఆ పాటికి చీకటి మొదలయింది. బత్తాణీలూ అయిపోవచ్చాయి.

తమ ఇంటి గుమ్మంముందు నుంచుని బామ్మ "సీనూ" అని గట్టిగా అరిచింది.

"వస్తున్నా బామ్మా-" అంటూ సీతనువిడిచి సీను వీధిని దాటాడు.

బామ్మ ఎప్పుడూ చెయ్యలేదు ఆపని!-తన్ను ఎత్తుకుంది.

ఇదేమిటి? బామ్మ ఏడ్చేస్తూంది... "మీ అమ్మ చచ్చిపోయిందిరా నాయనా-" అంది.

అంటే? ? ?

...గది గుమ్మందగ్గర నిల్చునివున్నాడు సీను. బామ్మ, నాన్న, ఆచార్లుగారు... ఇంకా ఎవరెవరోవున్నారు ఆ గదిలో. వాళ్ళెవరూ తన్ను చూడలేదు. అమ్మ పడుకునేవుంది.

సీను వీధిలోకి వచ్చాడు ... చీకటి బాగా అల్లుకుని పోయివుంది. కాని దీపాలు ఇంకా వెలగలేదు. అక్కడో కుక్క అరిచినట్లు వినిపిస్తే టైగర్ కాబోలు అనుకున్నాడు. ఇప్పుడు

తనకు ఆకలిగావుంటేనే ఎవరూ పట్టించుకోలేదు. ఇంక టైగర్‌కు అన్నం ఎవరు పెడతారు...

లోపలికి వెడదామనుకున్నాడు సీను. వీధినడవాలోంచి చూశాడు. అమ్మ హాల్లోకి వచ్చి పడుకునివుంది. ఇన్ని లాంతర్లూ అవీవుండగా దేవుడిదగ్గరపెట్టినట్లు ఇక్కడ ఈ చిన్న దీపం ఎందుకో-అనుకున్నాడు. నాన్న మొహం చూశాడు. లోపలికి వెళ్ళాలనిపించలేదు. మళ్ళీ వీధిలోకి వచ్చాడుసీను. అరుగుమీద పడుకున్నాడు. నిద్రపోయ్యాడు. వీధిదీపాలు అప్పుడే వెలిగాయి.

నిద్రమత్తులోవుండగా ఎవరో లేపారు సీనుని. పక్కింటి సుబ్బాయమ్మ పిన్ని కాబోలు...

సుబ్బాయమ్మ సీనునెత్తుకుని తమఇంట్లోకి తీసుకెళ్ళి మంచంమీద పడుకోబెట్టింది. వాడు నిద్రలేవలేదు. ఆమె, ఇంత కూరా అన్నమూ కలుపుకొచ్చి వాణ్ణి లేపింది.

కళ్ళు నలుపుకుంటూ లేచాడుసీను-"అమ్మలేచిందా?" అన్నాడు.

పిన్నిగారొక గుటకమింగింది. "ముందు ఈ అన్నంతిను, చెబుతా!" అంది.

"నన్నుఅడక్కుండా ఇంకెవరింట్లోనూ ఏదీ తినకూడదు

అని చెప్పింది అమ్మ. అమ్మనడిగొచ్చి తింటా'' అని మంచం దిగబోయాడుసీను.

"మీ అమ్మే నాతో చెప్పిందబ్బాయ్-'' అని అన్నం తినిపించింది ఆవిడ.

పిన్నికూడా మంచిదే. ఆమె మెడమీద మడతలు చూసి ఇదివరకట్లా నవ్వకూడదు. తప్పు... అనుకుంటూనే-నిద్రపోయాడుసీను... అన్నం తింటూనే పడుకునిద్రపోయినవాడినోటిని తడిచేత్తో తుడిచింది. చీరకొంగుతో ఒత్తింది. భగవంతుణ్ణి స్మరిస్తూ లోపలికి వెళ్ళింది పిల్లల్లేని సుబ్బాయమ్మ పిన్ని...

—మరుసటి రోజంతా నాన్నగారు ఏవిటోగావున్నారు. ఇల్లంతా వెతికినా అమ్మ కనపడలేదు ఎక్కడికి వెళ్ళింది...!

ఆమాటే నాన్ననడిగితే నన్ను దగ్గిరికిలాక్కొని గుండెలు కదుముకున్నారు. నోటికి తువ్వాలడ్డం పెట్టుకున్నారు. ఇంక మళ్ళీ అలా అడక్కూడదు అనుకున్నాడు సీను.

అమ్మ తనతో చెప్పకుండా ఎక్కడికీవెళ్ళదే... ఒకసారిలాగే వెళ్ళికని అదేదో వూరికెళుతూ-అమ్మ తనకెన్నో మిఠాయిలు కొనిపెట్టి- "చక్కగా చదువుకో బాబూ... అల్లరి చెయ్యకు. ఏం? నాన్నగారి మాటవిను. నేను రెండ్రోజుల్లో వస్తాను-'' అని చెప్పివెళ్ళింది. ఈసారి అలాచెప్పకుండా ఎట్లా

వెళ్ళింది? ఒకవేళ తను సుబ్బాయమ్మ పిన్నిఇంట్లో నిద్రపోతుం డగా వెళ్ళిందేమో...?ఆ! అదే తప్పకుండా అదే అయ్యుం టుంది. ఛీ ఛీ... తానుత్త వెధవ-లేకపోతే అమ్మను విడిచిపెట్టి పక్కింట్లోకెళ్ళి నిద్రపోవడమేమిటి ... ఇంకెప్పుడూ అలా చెయ్యకూడదు. అమ్మరాగానే అడగాలి-చెప్పకుండా ఎందు కెళ్ళావని...

గడియారం ఒంటిగంట కొట్టింది. సీను వీధిలోకి వచ్చాడు. ఎండ బలేగా కాస్తూంది. కళ్ళని పొడిచింది.

ఎదురింటి వరండాలో నల్లసీత కనిపించింది. దాన్తోబాటు గోపీవున్నాడు. సీనుకూడా వెళ్ళాడు. కాస్సేపట్లో జానకి వచ్చింది. నలుగురూ కలిసి దాగుడుమూతలాట మొదలె ట్టారు.

సీను మూడోసారి ఇంటి అరుగుక్రింద కూర్చుని వుండగా జానకి వెతుకుతూ వచ్చింది. గోపీ సీతా, ఇంజనీరు బంగళాలో చింతచెట్టువెనక దాక్కున్నారు.

అరుగుక్రింద కూర్చునివున్న సీనుకి వీధిచివర దారి కడ్డంగా ఏదోవున్నట్లు అన్పించింది. ఆపాటికి ఎక్కడినుండి వచ్చాయోగాని దట్టంగా మబ్బులు వచ్చాయి. సూర్యుడు కనబడ్డంలేదు. చల్లగా గాలివీచింది. ఉలిక్కిపడ్డాడు చొక్కా లేనిసీను. అరుగు బయటికి వచ్చాడు.

"దొంగా! దొరికి పోయావ్" అని జానకి పట్టుకుంది.

"ఉండవే!" అని దాన్ని విదిలించుకుని వీధిచివరకు పరుగెత్తాడు సీను.

రోడ్డు కడ్డంగా టైగర్ పడుకుని వుంది.

"అమ్మ దొంగా! ఇన్నిరోజులూ కనపడకుండా వున్నావేం... ఇక్కడ పడుకుంటే నిన్నొచ్చి ఎత్తుకుపోవాలేమ్మా?—" అని దానిచెవులు మెలేశాడు సీను. అదేమీ పలకలేదు.

"ఓయబ్బో... పలకవేం? అలాగయితే నీకు పూరీలు పెట్టను ఫో—" అన్నాడు. తోకపట్టుకులాగాడు. మొహంఎత్తి ముద్దుపెట్టుకున్నాడు. నిల్చోపెట్టాడు. అది నేలమీదకు ఉండగా పడిపోయింది.

ఎక్కడికో వెళ్ళివస్తున్నారు ఆచార్లుగారు. ఇదంతా చూశారు... "ఛీ ఛీ! దాన్ని ముట్టుకోకురా సీనూ—అది చచ్చిపోయింది..." అన్నారు.

చచ్చిపోయింది!?!

అర్థమయింది.

అమ్మకూడా అదేలయింది.

"నాన్నా!" అని అరిచాడు సీను. అదే శ్రీనివాసుకు. భోరున ఏడుస్తూ ఇంట్లోకి పరుగెత్తాడు.

—ఒక్కసారిగా మబ్బులన్నీ తొలిగిపోగా సూర్యుడు ఫెళ్ళున వెలిగాడు.

చురుక్కుమని తగిలింది ఎండ.

("సాహితి"-65)